క్లుప్తంగా

క్రీడాకారుల ఎంపికకు నేడు పోటీలు

గుడిబండ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ఉదయం 9 గంటలకు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీలకు సంబంధించి క్రీడాకారుల ఎంపికకు పోటీలు జరపనున్నట్లు పీడీ సాయికృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ అంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు.

సహకార సంఘం మాజీ అధ్యక్షుడి మృతి



రఘునాథరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల: మండల పరిధిలోని గౌనివారిపల్లి సహకార సంఘం మాజీ అధ్యక్షుడు బూదిలివాండ్లపల్లి రఘునాథరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ గ్రామానికి చేరుకొని రఘునాథరెడ్డి భౌతికకాయానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

వదంతులను నమ్మొద్దు



మాట్లాడుతున్న ఎస్‌ఐ నరేంద్ర

పరిగి: మండలంలోని పైడేటిలో బుధవారం రాత్రి కిడ్నాప్ జరిగినట్లు ప్రచారం జరగడంతో పరిగి ఎస్‌ఐ నరేంద్ర గురువారం గ్రామానికి వెళ్లి గ్రామస్తులు, విద్యార్థులతో మాట్లాడారు. కిడ్నాప్ యత్నానికి పాల్పడినట్లు వచ్చిన వార్తలు వదంతులు మాత్రమేనన్నారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. అపోహలు వీడి ధైర్యంగా ఉండాలని సూచించారు. ప్రజలకు అండగా ఉంటామన్నారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సుప్రియ

గోరంట్ల: స్థానిక గిరిజన బాలికల సంక్షేమ పాఠశాలలో గురువారం గోరంట్ల ప్రభుత్వ అస్పత్రి డాక్టర్ సుప్రియ విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. పరిసరాల శుభ్రత, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. ఆరోగ్యాలను పరిరక్షించుకోవాలని సూచించారు.

ఇటుకల ఫ్యాక్టరీలో చోరీ

పెనుకొండ రూరల్: మండలంలోని అమ్మవారిపల్లిలో ఉన్న ఇటుకల ఫ్యాక్టరీలో చోరీ జరిగింది. కియా ఏఎస్‌ఐ ప్రసాద్ తెలిపిన వివరాలు మేరకు వెంకటగిరిపాళ్యం రోడ్డులోని ఇటుకల ఫ్యాక్టరీలోకి బుధవారం రాత్రి దుండగులు చొరబడ్డారు. టార్పాలిన్ పట్టలు, చెలికపారలు తదితర వాటిని చోరీ చేశారు. వీటి విలువ రూ. 30 వేలు ఉంటుందని యజమాని యల్లప్ప గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తీరనున్న నీటి సమస్య



జగనన్న కాలనీలో జేసీబీ ద్వారా పైప్‌లైన్ పనులు చేయిస్తున్న ఎంపీపీ

రొద్దం: రొద్దం గ్రామ పంచాయతీ పరిధిలో తాగు నీటి సమస్య పరిష్కారానికి ఎంపీపీ చంద్రశేఖర్ చర్యలు తీసుకున్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ జగనన్న కాలనీకి గురువారం పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఇళ్ల నిర్మాణం చేపడుతున్న లబ్ధిదారులకు నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా కందకూర్లపల్లి, సుబ్బరాయప్పకొట్టాల, రొద్దం బీసీ కాలని, పాతర్లపల్లి తదితర గ్రామాల్లో జేజేఎం, పంచాయతీ నిధులతో పనులు చేస్తున్నట్లు ఎంపీపీ చంద్రశేఖర్ చెప్పారు.

కంటి అద్దాల అందజేత



కంటి అద్దాలు అందజేస్తున్న డాక్టర్ జగదీశ్‌బాబు

రొద్దం: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా తురకలాపట్నం గ్రామంలో 80 మందికి డాక్టర్ జగదీశ్‌బాబు గురువారం కంటి అద్దాలు పంపిణీ చేశారు. మండలానికి 1988 కంటి అద్దాలు అందాయని, వాటిని కంటి దోషం ఉన్నవారికి అందజేస్తామన్నారు.

జయ కృష్ణా..ముకుందా మురారీ



వేణుగోపాల స్వామి కల్యాణోత్సవం



విశేష అలంకరణలో రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి



ఉత్సవమూర్తులను రథం వద్దకు తీసుకొస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ



మడకశిర రూరల్: తులసీధామ వృద్ధాశ్రమంలో వేణుగోపాలస్వామిని అలంకరించిన దృశ్యం

- భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జన్మాష్టమి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

హిందూపురం: పట్టణంలో గురువారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. వేణుగోపాల స్వామి అలయాలు భక్తులతో కిటకిటలడాయి. బాలలు రాధాకృష్ణుల అలంకరణలో మురిపించారు. చిన్న మార్కెట్‌లోని వేణుగోపాలస్వామి ఆలయం రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించి వెండి, బంగారు అభరణాలు, పుష్పాలంకరణలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు మేళ తాళాలతో ప్రాకారోత్సవం చేశారు. ఆలయ ఆవరణంలో కళ్యాణ వేదిక ఏర్పాటుచేసి రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి వేదమంత్రాలతో కల్యాణం నిర్వహించారు. అనంతరం పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. మధ్యాహ్నం చిన్నమార్కెట్ సర్కిల్ వద్ద రథాన్ని నిలిపి మామిడి, కొబ్బరి తోరణాలతో అలంకరించి వేదపండితులు రథం ఎదుట రథాంగహోమం నిర్వహించి పూర్ణాహుతి చేశారు. తర్వాత పల్లకీలో రుక్మిణీ, సత్యభామ సహిత వేణుగోపాలస్వామి ఉత్సవమూర్తులను తీసుకువచ్చి రథంలో కొలువుదీర్చి పూజలు చేశారు. అనంతరం వేణుగోపాల స్వామి గోవిందా అంటూ భక్తులు రథాన్ని ఆలయం వద్ద నుంచి ఎంఎఫ్‌రోడ్డు వరకు లాగారు. తర్వాత అటునుంచి తిరిగి ఆలయానికి చేర్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, కౌన్సిలర్ అయూబ్, నాగేంద్రబాబు, ట్రస్టు సభ్యులు నందకిషోర్, వేదపండితులు సునీల్‌శర్మ, అర్చకులు హరిప్రసాద్, ఈఓ నరసింహరాజు, కమిటీ సభ్యులు రాము,కార్తీక్ పాల్గొన్నారు. మెయిన్‌బజారులోని పేట వెంటరమణస్వామి,బెంగళూరురోడ్డులోని హయగ్రీవ ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో శ్రీకృష్ణుడి ప్రతిమను కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. సత్యనారాయణపేటలోని శేషాసాయిబాబా మందిరంలో సాయిబాబాను కృష్ణుడిగా అలంకరించారు. నానెప్పనగర్‌లోని సాయిబాబా ఆలయంలో విశేష పూజలు జరిగాయి. ముద్దిరెడ్డిపల్లి భాగ్యనగర్‌లో ప్రబోధసేవాసమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి విగ్రహం కొలువుదీర్చి పూజలు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మున్సిపల్‌ఆఫీసు వద్ద వెంకటరమణ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలబాలికలకు రాధాకృష్ణుల వేషాలు వేశారు. ప్రియ నాట్యమండలి ఆధ్వర్యంలో భరతనాట్య ప్రదర్శనలు నిర్వహించారు. పాండురంగనగర్‌లోని ఓం క్రియేషన్స్ స్కూల్ నిర్వాహకురాలు సరస్వతీ దండలతో శ్రీకృష్ణుడి ప్రతిమ వేసి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

మడకశిరరూరల్: మండలంలోని తులసీధామ వృద్ధాశ్రమంలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. వేణుగోపాలస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పాలాభిషేకం, దీపోత్సవం నిర్వహించారు. పంచరూప వీరాంజినేయస్వామికి, వేణుగోపాలస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వినియోగం చేశారు.



మోడల్‌కాలనీలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణ

సోమందేపల్లి: కృష్ణాష్టమిని పురస్కరించుకొని మండల కేంద్రమైన సోమందేపల్లిలో గురువారం ఉట్టిని కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఉట్టిని కొట్టేందుకు యువకులు పోటీ పడ్డారు. విజ్ఞాన్ పాఠశాలలో చదివే చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఐ విజయ్ కుమార్ పాల్గొన్నారు.



ఉట్టికొడుతున్న ఎస్‌ఐ విజయ్ కుమార్

'ఐటీ నోటీసులతో చంద్రబాబుకు వణుకు'



మాట్లాడుతున్న ఏజీపీ భాస్కరరెడ్డి

పెనుకొండ: మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు అభద్రతాభావంతో కొట్టుమిట్టాడుతున్నారని ఏజీపీ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్కిల్‌స్కాం, ఇతర కుంభకోణాల్లో చంద్రబాబు పాత్ర ఉన్నట్లు తేల్చిన ఐటీ అధికారులు ఆయనకు నోటీసులు జారీ చేయడంతో భయంతో వణికి పోతున్నాడన్నారు. కుంభకోణాల్లో చంద్రబాబు అడ్డంగా దొరికిపోతే ప్రతిపక్షంలో ఉన్న పవన్ కళ్యాణ్ నోరు మెదపకపోవడం దారుణమన్నారు. చంద్రబాబుతో పాటు ఆయన కుమారుడు లోకేష్‌ను అరెస్ట్ చేసే అవకాశం ఉందన్నారు. దీంతో రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నంలో తండ్రీకొడుకులు ఉన్నారని ఆరోపించారు. సీఎం జగనన్న రాష్ట్ర ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తుంటే జీర్ణించుకోలేక చంద్రబాబు, ఆయన కుమారుడు కుట్రలకు తెరలేపుతున్నారని విమర్శించారు.

ఫ్లెక్సీ పడి ఆర్టీసీ ఉద్యోగికి గాయాలు



బాధితుడు ప్రసాద్

హిందూపురం: తలపై ఫ్లెక్సీ పడి ఆర్టీసీ ఉద్యోగి గాయపడ్డాడు. ఈ ఘటన పరిగి బస్టాండ్ వద్ద గురువారం జరిగింది. ఆర్టీసీ ఉద్యోగి ప్రసాద్ వాహనంలో వెళ్తుండగా పరిగి బస్టాండ్ వద్ద కట్టిన ఫ్లెక్సీ గాలికి ఊగిసలాడుతూ అతని తలపై పడింది. రక్తగాయాలు కావడంతో ఆయన్ను ఆస్పత్రికి తరలించారు.

జగనన్నను మళ్లీ సీఎం చేయడమే ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



హాజరైన జనం

- జగనన్న చలువతోనే టీటీడీ బోర్డు సభ్యుడిగా నియామకం
- జీవితాంతం రుణపడి ఉంటా
- జిల్లాలో ఆలయాల అభివృద్ధికి కృషి
- మడకశిరను కోనసీమగా తీర్చిదిద్దుతా
- టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: వైఎస్సార్‌సీపీ శ్రేణులు కలిసి కట్టుగా పని చేసి సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే తిప్పేస్వామి పిలుపునిచ్చారు. టీటీడీ బోర్డు సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసిన ఆయన తొలి సారిగా గురువారం మడకశిరకు వచ్చారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. పట్టణంలోని వాల్మీకి సర్కిల్ నుంచి షిరిడీ సాయిబాబా ఆలయం వరకు వేలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. మహర్షి వాల్మీకి, డాక్టర్ అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు ఎమ్మెల్యే పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం షిరిడీ సాయిబాబా ఆలయ ఆవరణంలో జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తనకు టీటీడీ బోర్డు సభ్యుడిగా అవకాశం కల్పించారని, జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటానని తెలిపారు. మడకశిరను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి కోనసీమగా మార్చడమే తన ధ్యేయమని తెలిపారు. రూ.215 కోట్లతో మడకశిర బైపాస్ కెనాల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని దేవాలయాల అభివృద్ధికి టీటీడీ సభ్యుడిగా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. మడకశిర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు పోకల అశోక్‌కుమార్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌ను రెండోసారి గెలిపించుకోవాలని కోరారు. ఎమ్మెల్యే తిప్పేస్వామికి టీటీడీ బోర్డు సభ్యుడి పదవి రావడం నియోజకవర్గ ప్రజల అదృష్టమని తెలిపారు. అనంతరం ముస్లింలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అదే విధంగా బ్రాహ్మణులు, పురోహితులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. షిరిడీసాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి ఎమ్మెల్యేని ఆలయంలోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు రామకృష్ణ, నాగరాజగౌడ్, బిదురమ్మ, నాగన్న, రాజేశ్వరి, నాగలక్ష్మమ్మ, గగన, ఎంపీపీలు కవిత, ఈరన్న, రాధమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు సరోజమ్మ, సింగిల్‌విండో అధ్యక్షులు రామిరెడ్డి, చిక్కన్న,మోతిరామ్, జయరామప్ప, చంద్ర పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- సీడీపీఓ నాగమల్లేశ్వరి

మడకశిరరూరల్: బాలింతలు, గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని మడకశిర ప్రాజెక్టు సీడీపీఓ నాగమల్లేశ్వరి తెలిపారు. కదిరేపల్లి పంచాయతీ స్థాయి పౌష్టికాహార మాసోత్సవాలు, సీమంతాల కార్యక్రమం గురువారం గుర్రపుకొండ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. గర్భిణులకు సంప్రదాయబద్ధంగా సీమంతాలు నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు తీసుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఆకుకూరలు తీసుకోవాలన్నారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా టీకాలు వేయించుకోవాలన్నారు. అనంతరం తల్లి పాల ప్రాముఖ్యత, 108సేవలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ లీలావతి పాల్గొన్నారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఎం రంగాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాన్ని నిర్వహించారు.



గర్భిణులకు సీమంతం నిర్వహించిన దృశ్యం

గర్భిణులు, బాలింతలు తప్పని సరిగా పౌష్టికాహారంతోపాటు అకుకూరలను ఆహారంగా తీసుకోవాలని కార్యదర్శి ఆనంద్‌కుమార్ సూచించారు. చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఎంపీటీసీ సునీతమ్మ, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రొళ్ల: మండల పరిధిలోని కొత్తపాళ్యంతండా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పోషణ మాసోత్సవాలు జరిగాయి. ఐసీడీఎస్ సూపర్ వైజర్ సన్నమ్మ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార ఆవశ్యకతను వివరించారు.

ఎమ్మెల్యే తిప్పేస్వామికి అభినందనల వెల్లువ

హిందూపురం: తిరుమల తిరుపతి ఆలయ పాలక మండలి సభ్యుడిగా నియమితులైన మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. టీటీడీ సభ్యుడిగా నియమితులైన అనంతరం ఎమ్మెల్యే తొలిసారిగా గురువారం మడకశిరకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఏపీ ఆగ్రో చైర్మన్ నవీన్‌నిశ్చల్ తిప్పేస్వామిని ఆయన స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వేంకటేశ్వరస్వామి ప్రతిమను అందించి ఘనంగా సన్మానించారు. నవీన్ నిశ్చల్ మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామికి సేవ చేసేందుకు అవకాశం లభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య, విద్యార్థిసంఘ నాయకులు పాల్గొన్నారు.

మడకశిర: టీటీడీ బోర్డు సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసి తొలిసారిగా మడకశిరకు విచ్చేసిన ఎమ్మెల్యే తిప్పేస్వామిని గురువారం ఆయన నివాసంలో రొళ్ల జెడ్పీటీసీ ఆనంతరాజు కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యే తిప్పేస్వామికి వేంకటేశ్వరస్వామి ప్రతిమ అందించి అభినందిస్తున్న నవీన్‌నిశ్చల్

మడకశిర రూరల్: జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గురువారం ఎమ్మెల్యే తిప్పేస్వామిని ఆయన స్వగృహంలో కలిసి సన్మానించారు. కమిటీ సభ్యులు వెంకటేష్, వీరనారాయణ, శ్రీనివాసులు, నరసింహమూర్తి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉత్సాహంగా మండల స్థాయి క్రీడా పోటీలు



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

గోరంట్ల: స్కూల్‌గేమ్స్‌లో భాగంగా స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. త్రోబాల్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, చెస్ తదితర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అండర్ 17 బాలుర విభాగంలో వాలీబాల్ అంశంలో గోరంట్ల జిల్లా పరిషత్ విద్యార్థులు ప్రథమ స్థానంలో, పాలసముద్రం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. కబడ్డీ పోటీల్లో గోరంట్ల బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. మండలస్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు. బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గోపాల్, పీడీలు రామ్మోహన్, మనోహర్, చంద్రనాయక్ పాల్గొన్నారు.

ఈజీఈఆర్ సర్వే వేగవంతం చేయండి

రొళ్ల: 'ఎడ్యుకేషన్ గ్రాస్ ఎన్‌రోల్మెంట్ రేషియో' (ఈజీఈఆర్) సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంఈఓ–2 శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని కాకి సచివాలయాన్ని పీఆర్పీలతో కలిసి సందర్శించారు. తర్వాత సచివాలయం సిబ్బంది వలంటీర్లకు ఎడ్యుకేషన్ గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియోపై అవగాహన కల్పించారు. పదో తరగతి వరకు చదివి బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి కళాశాలలో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం అలుపనపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. తర్వాత నాడు–నేడు పనులను పరిశీలించారు.

ప్రత్యేక అలంకరణ



కోన మల్లేశ్వర స్వామికి అలంకరణ

పెనుకొండ: మండలంలోని ప్రముఖ ఆలయమైన కోన కణ్వాశ్రమంలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కోన మల్లేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తిని ఊరేగింపు నిర్వహించారు. పెనుకొండ, సీకే పల్లి మండలాల నుంచి పలు గ్రామాల ప్రజలు వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

గోపాలుడికి జలధి పూజ

అమరాపురం: కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలో గురువారం దక్షిణ గొల్లహట్టిలో యాదవ కులస్తుల ఆధ్వర్యంలో శ్రీ కృష్ణునికి ఘనంగా జలధి ఉత్సవాన్ని నిర్వహించారు. సమీప చెరువు వద్దకు స్వామివారి చిత్ర పటాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి గంగా జలంతో శుద్ధి చేసి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం డప్పు వాయిద్యాలతో స్వామివారి చిత్ర పటాన్ని తిరిగి ఆలయానికి చేర్చారు.

యాజమాన్యం మొండి వైఖరి వీడాలి

హిందూపురం అర్బన్: తూమకుంట పారిశ్రామిక వాడలో విప్రో అనుబంధ సంస్థ గురునానక్ కర్మాగారం వద్ద నాల్గోరోజు గురువారం కార్మికులు ఆందోళన కొనసాగించారు. వీరికి సీపీఐ, సీఐటీయూసీ నాయకులు మద్దతు పలికారు. కార్మిక సంఘం అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ యాజమాన్యం మొండి వైఖరి వీడి ఈఎస్‌ఐ, పీఎఫ్, కనీస వేతనాల చట్టం అమలు చేయాలన్నారు.

విత్తన ఉలవలు పంపిణీ

మడకశిర రూరల్: హరేసముద్రం ఆర్బీకేలో గురువారం రాయితీ విత్తన ఉలవలను సర్పంచ్ కరియన్న, ఏఓ తిమ్మప్ప పంపిణీ చేశారు. 10 కేజీల ఉలవల బ్యాగు 80 శాతం రాయితీపోను రూ.218కు అందిస్తున్నట్లు తెలిపారు.

కారును ఢీకొన్న లారీ

సోమందేపల్లి: బెంగళూరు వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారును గురువారం మండలంలోని పాపిరెడ్డిపల్లి క్రాస్ వద్ద జాతీయ రహదారిపై లారీ అతివేగంగా వచ్చి ఢీకొంది. అయితే ఎవరికీ గాయాలు కాలేదు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సత్కారం

హిందూపురం టౌన్: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పురస్కారం అందుకున్న సీ.చెర్లోపల్లి ఆదర్శపాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలు కేటి సలోమి గ్లోరియాను గురువారం స్థానిక పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ అశోక్ నాయక్ పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి గాయాలు

పరిగి: మండలంలోని 544వ జాతీయ రహదారిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. పరిగి మండలానికి చెందిన విట్టాపల్లి రామాంజి, హిందూపురం మండలం సింగరెడ్డిపల్లికి చెందిన నరసయ్య బైక్‌పై ధనాపురం వైపు నుంచి హిందూపురం వైపు వస్తుండగా పరిగి సమీపంలో బైక్ అదుపు తప్పింది. దీంతో ఇద్దరూ కిందపడి గాయపడ్డారు. అటుగా వచ్చిన పరిగి సర్పంచ్ లక్ష్మీదేవి భర్త శివశంకర్ స్థానికుల సహాయంతో క్షతగాత్రులను హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నరసయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తరలించారు.

నేడు సదస్సులు

రొళ్ల: బాల్య వివాహాలతో జరిగే అనర్థాలపై స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాల ఆవరణలో శుక్రవారం సదస్సులు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ సూపర్ వైజర్ సన్నమ్మ తెలిపారు.

కుట్టుమిషన్ అందజేత

గోరంట్ల: గోరంట్ల మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు రేణుకమ్మ, ఆమె భర్త విశ్రాంత హెచ్‌ఎం శంకరనారాయణ దాతృత్వం చాటారు. పట్టణంలోని వినాయక నగర్‌కు చెందిన పేదమహిళ వరలక్ష్మికి గురువారం రూ.15వేల విలువైన కుట్టుమిషన్ అందజేశారు.

లోటుపాట్లు ఉంటే తెలియజేయండి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ కార్తీక్

పెనుకొండ: ఓటర్ల జాబితా పునః పరిశీలనపై సబ్‌కలెక్టర్ కార్తీక్ గురువారం తన కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అన్ని మండలాల్లో స్పెషల్ ఆఫీసర్లతో ఓటరు జాబితా పునఃపరిశీలన జరుగుతోందన్నారు. ఓటర్ల జాబితా పునఃపరిశీలన, ఫారం -6, ఫారం-7, ఫారం-8లలో లోటుపాట్లు ఉంటే తెలియజేయాలన్నారు. ఏఓ రమణ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోండి

పెనుకొండ: నాగలూరు బండ్లపల్లిలో కల్లు తాగి పలువురు అస్వస్థతకు గురైన ఘటనకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ, కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం సబ్ కలెక్టర్ కార్తీక్‌ను కలిసి వినతి పత్రం అందించారు. బాధితుల్లో ఎక్కువమంది దళితులు ఉన్నారని, వారికి సరైన వైద్యం అందించేలా చూడాలని కోరారు. రమేష్, గంగాధర్ పాల్గొన్నారు.